నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I హైదరాబాద్, మంగళవారం 25 మార్చి 2025 HYDERABAD



## 24 గంటల్లో వర్ష సూచన

సిటీబ్యూరో, మార్చి 24 (నమస్తే తెలంగాణ): ద్రోణి ప్రభావంతో రాగల 24గంటల్లో గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ద్రోణి ప్రభావంతో నగరంలో పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 33.8, కనిష్ఠం 23.4 డిగ్రీలు, గాలిలో తేమ 42శాతంగా నమోదైనట్లు అధికారులు తెలిపారు.



చిలుకానగర్‌లో చెత్తాచెదారంతో దుర్గంధంగా మారిన పరిసరాలు

# దిగజారిన రక్షణ.. చేజారిన భద్రత

### రెండ్రోజుల్లో రెండు అత్యాచారయత్నాలు

### ఓ సహ నటిపై..ఎంఎంటీఎస్‌లో వెళ్తున్న యువతిపై..

### నగరంలో అతివలకు భద్రత కరువు

సిటీబ్యూరో, మార్చి 24 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరం రోజురోజుకూ భయానకంగా మారుతోంది. నిర్భయ లాంటి కఠిన చట్టాలు ఉన్నా మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు ఆగడం లేదు. కామాంధులు రోజురోజుకూ రెచ్చిపోతూ దారుణాలకు పాల్పడుతున్నారు. వరుస ఘటనలతో సిటీలో మహిళలు బెంబేలెత్తిపోతున్నారు. ప్రధానంగా రెండురోజుల్లో రెండు ఘటనలు జరగడం, అది కూడా నగరం నడిబొడ్డున ఒకరిపై, వేలాది మంది ప్రయాణించే ఎంఎంటీఎస్ ట్రైన్‌లో మరొకరిపై జరిగిన అత్యాచారయత్నాలతో దుండగులు పోలీసులకు సవాల్ విసురుతున్నారు. సోమవారం సికింద్రాబాద్ నుంచి మేడ్చల్ వెళ్తున్న ఎంఎంటీఎస్ ట్రైన్‌లో యువతిపై అత్యాచారయత్నం జరిగింది. మేడ్చల్‌లోని హాస్టల్‌లో ఉంటున్న అనంతపురం జిల్లా ఉరవకొండకు చెందిన యువతి(23) సెల్‌ఫోన్ పాడవ్వడంతో రిపేర్ కోసం శనివారం రాత్రి సికింద్రాబాద్‌కు వచ్చింది. సెల్‌ఫోన్ బాగు చేయించుకున్న తర్వాత తిరిగి ఎంఎంటీఎస్‌లో మేడ్చల్ బయలుదేరింది. మహిళల కోచ్ అయితే సురక్షితమనుకున్న ఆ యువతి అందులో ఎక్కింది. కోచ్‌లో తనతో పాటు ఉన్న మరో ఇద్దరు మహిళలు అల్వాల్‌లో దిగిపోయారు. తాను మాత్రం ఒంటరిగా కూర్చుంది. నల్ల చొక్కా వేసుకున్న ఓ దుండగుడు కొంపల్లి దగ్గర మహిళల కోచ్‌లోకి ఎక్కాడు. యువతి దగ్గరకు వచ్చి టీజ్ చేశాడు. ఆ తర్వాత ఆ దుండగుడు ఆమెపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. అతడి నుంచి తప్పించుకునేందుకు ఆ యువతి కదులుతున్న ట్రైన్ నుంచి దూకేసింది. కొంపల్లి దాటిన తర్వాత వంతెన వద్ద పడిపోయిన ఆమెకు తీవ్రగాయాలు కావడంతో జీఆర్పీ పోలీసులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని పోలీసులు చెప్పారు. అయితే యువతి చెబుతున్నదాని ప్రకారం దుండగుడు ఎప్పుడు ఆ బోగీలోకి వచ్చాడో గమనించలేదని, అల్వాల్‌లో ఇద్దరు మహిళలు దిగిపోయిన తర్వాత ట్రైన్ కదలగానే తనను గట్టిగా పట్టుకున్నట్లు యువతి పోలీసులకు తెలిపింది. దీంతో అతడిని ప్రతిఘటించి ట్రైన్ నుంచి దూకేసినట్లు ఆమె చెప్పినట్లు పోలీసులు తెలిపారు. రైల్వే ఎస్పీ చందనాదీప్తి ఈ కేసును చాలా సీరియస్‌గా పర్యవేక్షిస్తున్నారు. సీసీ ఫుటేజీల ఆధారంగా దుండగుడి ఆచూకీ కోసం ప్రయత్నిస్తే అసలు సికింద్రాబాద్‌లో తప్ప.. మిగతా చోట్ల సీసీ కెమెరాలు లేవని, కొన్నిచోట్ల ఉన్నా అవి పనిచేయట్లేదని పోలీసులు చెప్పారు. నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. దవడ వద్ద తీవ్రగాయమైందని, పై పళ్లు ఊడిపోవడంతో మాట్లాడడం కష్టమవుతున్నదని బాధితురాలి సోదరుడు చెప్పారు.

#### పనిచేయని కెమెరాలు..

కెమెరాలు పనిచేయకపోవడంతో నిందితుడిని గుర్తించడం పోలీసులకు కష్టమవుతోంది. మరోవైపు పోలీసులకు నిందితుడికి తాలూకు ప్రయాణ వివరాలు



కూడా తెలుసుకునే పరిస్థితి లేకుండా పోయిందని ఓ అధికారి చెప్పారు. ఇదిలాఉంటే నిందితుడు యువతికి ముందే తెలిసిన వాడా.. లేక ఆమెను వెంబడిస్తూ వచ్చాడా.. అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. యువతి చెప్పిన ఆనవాళ్ల ప్రకారం స్టేషన్‌తో కనెక్టివిటీ ఉన్న సీసీ ఫుటేజీ అంతా పరిశీలిస్తున్నట్లు సమాచారం.

#### నాలుగు బృందాలతో ..

అన్ని స్టేషన్లు, అన్ని బోగీల్లో సీసీ కెమెరాలు లేవని రైల్వే ఎస్పీ చందనాదీప్తి చెప్పారు. ఈ కేసులో నిందితుడిని పట్టుకోవడానికి నాలుగు బృందాలు వేసి గాలింపు చర్యలు చేపట్టామని చందనాదీప్తి చెప్పారు. ఈ కేసును ఛేదించడం తమకు పెద్ద సవాల్ అని.. అయినా త్వరలోనే కచ్చితంగా నిందితుడిని పట్టుకుంటామని చందనాదీప్తి చెప్పారు. ప్రధానంగా ప్రయాణికులు వారి భద్రత వారే చూసుకోవాలని, అందుకోసం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

#### బాలీవుడ్ సహ నటిపై అత్యాచారయత్నం..

ముంబైకి చెందిన ఓ బాలీవుడ్ సహ నటి హైదరాబాద్‌కు వచ్చిన మూడురోజుల తర్వాత తనపై అత్యాచారయత్నం చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేయడం, ఆ తర్వాత పోలీసులు కేసు ఛేదించే పనిలో అసలు ఈ ఫిర్యాదే తప్పుడు ఫిర్యాదంటూ ప్రెస్‌నోట్ విడుదల చేయడం సంచలనంగా మారింది. ఓ షాపు ప్రారంభోత్సవం పేరుతో ముంబై నటిని ఆహ్వానించి ఆపై ఆమెను బంధించి వ్యభిచారం చేయాలంటూ ఒత్తిడి చేసిన (మిగతా IVవ పేజీలో)

## అందాల పోటీలు కాదు.. అమ్మాయిలకు రక్షణ కల్పించండి

### కాంగ్రెస్ పాలనలో మహిళలకు భద్రత కరవు

### ఎంఎంటీఎస్‌లో యువతిపై అత్యాచారయత్న ఘటనపై బీఆర్‌ఎస్ ఆగ్రహం

### గాంధీలో బాధితురాలిని పరామర్శించిన మాజీ మంత్రులు సబిత ఇంద్రారెడ్డి, శ్రీనివాస్ గౌడ్

సిటీబ్యూరో/బన్సీలాల్‌పేట, మార్చి 24,(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని అమ్మాయిలు, మహిళలకు భద్రత కల్పించకుండా అందాల పోటీలు పెడుతున్నారని, కాంగ్రెస్ పాలనలో ప్రతిరోజూ ఏదో ఒక మూలన మహిళలపై దాడులు జరుగుతూనే ఉన్నాయని, ఆడవాళ్లకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఎంటీఎస్ రైలులో అత్యాచారయత్నానికి గురై, రైలు నుంచి దూకి గాంధీలో చికిత్స పొందుతున్న బాధిత యువతిని సోమవారం మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి తో కలిసి పరామర్శించారు. మెరుగైన సేవలందించాలని గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారికి సూచించారు. అనంతరం సబిత ఇంద్రారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదు అనే విషయాన్ని ఈ సంఘటన తెలియజేసిందని వాపోయారు. ఇటీవల పోలీసు శాఖ విడుదల చేసిన వార్షిక నివేదికలో గత 15 నెలల వ్యవధిలోనే రాష్ట్రంలో 22 శాతం క్రైమ్ రేటు పెరిగినట్లు అందులో ప్రకటించారని ఆమె గుర్తుచేశారు. రైలు, బస్సుల్లో (మిగతా IVవ పేజీలో)



## ప్రియుడి జేబులో గంజాయి.. చిక్కుల్లో పడ్డ అమ్మాయి

### ప్రేమికుల మధ్య గంజాయి చిచ్చు..

### ప్రియురాలిపై కక్షగట్టి ఫొటోలు..వీడియోలు

### భర్తకు పంపిస్తానని ప్రియుడి బెదిరింపులు

వెంగళరావునగర్: భర్తకు తెలియకుండా గుట్టుగా ప్రియుడితో సరసాలాడి చిక్కుల్లో పడింది ఓ మహిళ. సురారం ప్రాంతానికి చెందిన ఓ గృహిణి (25) కూకట్ పల్లిలోని ఓ కాస్మొటిక్ క్లినిక్ లో లేజర్ టెక్నీషియన్ గా పని చేస్తున్నది. అక్కడే అన్వేశ్ అనే వ్యక్తి థెరపిస్ట్ గా పనిచేసేవాడు. ప్రేమిస్తున్నానని వెంటపడేవాడు. ఆమె ప్రేమ పొందేందుకు చేతిని సైతం కోసుకున్నాడు. దీంతో తనపై అంత ప్రేమ చూపించే అన్వేశ్ ప్రేమను అంగీకరించింది. పెళ్లై భర్త ఉన్నప్పటికీ చాటుమాటుగా ప్రియుడితో సరసాలాడేది. ఓ రోజు ప్రియుడి జేబులో గంజాయి ప్యాకెట్ ను చూసింది. వెంటనే అతడి చెల్లికి గంజాయికు అలవాటు పడ్డాడని చెప్పింది. ఆ విషయం తెలిసి కుటుంబంలో చెడ్డవాడిగా ముద్ర వేశారని, ఉద్యోగం పోవడానికి కారణమైందని ప్రియురాలిపై కక్ష గట్టాడు. దీంతో తనతో కలిసి దిగిన ఫొటోలు.. వీడియోలను 'నీ భర్తకు పంపుతా' నని.. సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బెదిరింపులకు గురిచేశాడు. ప్రియురాలికి ఆడియో మెసేజ్ పంపాడు. చాటుమాటుగా చేసిన తన గుట్టంతా బయటపడితే కాపురం పోతుందని భయపడిపోయి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మెట్రో వద్ద గంజాయి అమ్మకం

### ఘరానా నేరస్తుడు శివారెడ్డి అరెస్టు

### రూ.60 లక్షల విలువ చేసే 119 కిలోల సరుకు సీజ్

### మరో కేసులో ముగ్గురు విద్యార్థులు అరెస్ట్

సిటీబ్యూరో: ఒడిశా కేంద్రంగా నగరానికి భారీగా గంజాయి సరఫరా చేస్తున్న ఘరానా నేరగాడిని ఆబ్కారీ ఎస్టీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. ముగ్గురు విద్యార్థులు సైతం పట్టుబడ్డారు. ఈ రెండు కేసుల్లో మొత్తం రూ.60లక్షల విలువైన 119 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్ ఖురేషి వివరాలు వెల్లడించారు. భూర్గుపాడుకు చెందిన దుగ్యంపూడి శివశంకర్‌రెడ్డి అలియాస్ శివారెడ్డి ఒడిశాలోని చిత్రకొండ ప్రాంతం నుంచి తక్కువ ధరలో గంజాయిని కొనుగోలు చేసి, హైదరాబాద్‌లోని గంజాయి వ్యాపారులకు హోల్‌సేల్ ధరలో సరఫరా చేస్తున్నాడు. అనేక సార్లు పట్టుబడ్డాడు. అయినా ప్రవర్తన మార్చుకోకుండా అమీర్‌పేట, బాలానగర్, కూకట్‌పల్లి తదితర ప్రాంతాల్లో విద్యార్థులు, ఐటీ ఉద్యోగులే లక్ష్యంగా చేసుకుని గంజాయి సరఫరా చేస్తున్నాడు. ఎస్టీఎఫ్ బృందం జేఎన్‌టీయూ మెట్రో స్టేషన్ సమీపంలో కొనుగోలుదారుడికి గంజాయిని అందించేందుకు యత్నిస్తున్న శివారెడ్డిని అరెస్టు చేశారు. అలాగే రాహుల్ , అజయ్ కుమార్, తాడిపల్లి అభిలాష్ నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీటెక్ చదువుతున్నారు. వ్యసనాలకు అలవాటు పడిన ఈ విద్యార్థులు విలాసాల కోసం గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నారు. సఎస్టీఎఫ్ పోలీసులు విద్యార్థులు నివాసం ఉంటున్న గదిపై దాడులు జరిపారు. ఇద్దరు బీటెక్ విద్యార్థులతో పాటు మరో డిగ్రీ విద్యార్థిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 4కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

# రైజింగ్ కాదు.. ఫాలింగ్

## హైదరాబాద్ అభివృద్ధిపై విజన్‌లేని సర్కార్

### మళ్లీ కరెంటు కోతలు.. తాగునీటి కరువు

### 40శాతం లైట్లు వెలుగుతలేవు..

### గతేడాది బడ్జెట్‌లో 25శాతం కూడా నిధులను ఖర్చుపెట్టలె..

### అసెంబ్లీలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

హైదరాబాద్, మార్చి 24 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రైజింగ్ కాదు.. ఫాలింగ్ కాకుండా చూడాలని, హైదరాబాద్ నగరాభివృద్ధిపై కాంగ్రెస్ సర్కారుకు ఒక విజన్ అంటూ లేకుండా పోయిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ నిప్పులు చెరిగారు. ప్రభుత్వ నిర్ణయాలతో హైదరాబాద్ ప్రగతి పడకేస్తున్నదని మండిపడ్డారు. గత పదేండ్లల్లో లేకుండా పోయిన కరెంటు కోతలు, నీటి ఎద్దడి పరిస్థితులు దాపురించాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో సోమవారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్, ఇండస్ట్రీస్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఐటీ, కమ్యూనికేషన్స్ తదితర శాఖలకు సంబంధించిన బడ్జెట్ పద్దులపై చర్చ కొనసాగింది. ఈ చర్చలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద్ పాల్గొని మాట్లాడారు. హైదరాబాద్ నగరంపైన గత 16నెలలుగా ప్రభుత్వం దృష్టి ఏరకంగా ఉందో బడ్జెట్‌లో కేటాయింపులు, చేసిన ఖర్చులే నిదర్శనంగా నిలుస్తాయని వివరించారు. తొలుత బీఆర్ఎస్‌పై రుణమాఫీని సంపూర్ణంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే హైదరాబాద్ నగరాభివృద్ధికి గతేడాది రూ.10వేల కోట్లు ప్రత్యేకంగా కేటాయిస్తామని చెప్పారని, కానీ అందులో కనీసం 25శాతం నిధులను కూడా విడుదల చేయలేదని విమర్శించారు. ఈ ఏడాది కూడా హైదరాబాద్ నగరానికి రూ.7582కోట్లు డిమాండ్ చేస్తే అందులో 40శాతం మాత్రమే ఇస్తామని చెప్పిందని, ప్రభుత్వం కమిట్‌మెంట్ ఏమిటో తెలిసిపోతున్నదని మండిపడ్డారు. జలమండలి మీద ఇప్పటికే రూ.1500కోట్ల రుణం ఉందని, మరో 2050కోట్ల భారం మోపనున్నారని తెలిపారు. కొండ పోచమ్మ సాగర్ నుంచి కాకుండా ఎవరి ప్రయోజనాల కోసం మల్లన్న సాగర్ నుంచి 7కోట్ల ఖర్చుతో నీటిని సరఫరా చేయాలని చూస్తున్నారని నిలదీశారు. తెలంగాణ ఏర్పాటుకు ముందుకు జలమండలి ముందు నిత్యం ఖాళీ కుండలతో ధర్నాలు చేసే పరిస్థితి ఉండేదని, మళ్లీ ఈ ఏడాది పాతరోజులను గుర్తుచేస్తున్నారని, అదేమంటే ఎండలు నెల ముందే మొదలయ్యాయని సర్కారు సాకులు చెబుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగార్జునసాగర్ డెడ్ స్టోరేజీ నుంచి నీళ్లు తీసుకువచ్చే సుంకిశాల పనులను గత ప్రభుత్వ హయాంలోనే 80 శాతం పూర్తయ్యాయని, కానీ కాంట్రాక్టు మేఘా కంపెనీ నిర్లక్ష్యం, ప్రభుత్వం అలసత్వం వల్ల అది కూలిపోయిందని, ఇప్పుడు ఎమర్జెన్సీ మోటార్లు పెడుతున్నారని మండిపడ్డారు. మేఘా కంపెనీపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. ఎమర్జెన్సీ (మిగతా IVవ పేజీలో)





కోఠి డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ధర్నా చేపట్టిన ఆశా వర్కర్లను లాకెళ్తున్న పోలీసులు

## ఫోర్త్ సిటీకి 36 మంది అధికారులు

సిటీబ్యూరో, మార్చి 24(నమస్తే తెలంగాణ): ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ ఆథారిటీకి వివిధ స్థాయిలో 36 మంది ఉద్యోగులను శాశ్వత ప్రతిపాదికన నియమించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కమిషనర్, అడిషనల్ కమిషనర్‌తో పాటు ఏవో, ఆర్థిక విభాగం, డైరెక్టర్ టౌన్ ప్లానింగ్, ప్లానింగ్ ఆఫీసర్, ఇంజినీరింగ్ విభాగంతోపాటు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ స్థాయి ఉద్యోగిని ఎస్టేట్ ఆఫీసర్‌గా నియమించనున్నది. అదేవిధంగా అదనంగా లీగల్ విభాగానికి సెక్రెటరీ హెచ్‌వోడీతో పోస్టులను మంజూరు చేస్తూ ఉద్యోగాల భర్తీ, జీత భత్యాలు, అర్హతలతో జీవో ఎంఎస్ నం. 31తో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## 1,000 లాభం చూపించి.. ₹75.65 లక్షలు కొట్టేశారు!

### సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు బురిడీ

సిటీబ్యూరో: బాలాపూర్‌లో నివాసముండే ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు సైబర్ నేరగాళ్లు రూ. 75 లక్షలు బురిడీ కొట్టించారు. బాధితుడి వాట్సాప్‌నకు సెక్యూర్ ట్రేడ్ పేరుతో మేసేజ్ వచ్చింది. ట్రేడింగ్‌లో 30 శాతం లాభాలు సంపాదించాలంటే తాము సూచించిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. బాధితుడు ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని మొదట రూ.50 వేలుపెట్టుబడి పెట్టగా, రూ. 2471 నష్టంతో ఆ స్టాక్‌ను విక్రయించాడు. మరో రూ.50 వేలు పెట్టుబడితో పారాగాన్ స్టాక్స్‌ను, ఆ తరువాత అడానైంట్ స్టాక్స్‌ను కొని రూ.2 వేల చొప్పున నష్టంతో విక్రయించాడు. నికోలస్ ఆఫీస్ సొల్యూషన్ లిమిటెడ్ ఐపీఓ ఆఫర్‌లో ఉందని సూచించడంతో రూ. 8.3 లక్షలు పెట్టుబడి పెట్టడంతో 7095 షేర్స్ అలాట్ అయ్యాయి, వాటిని కొని విక్రయించడంతో రూ.14.47 లక్షల లాభం కనిపించింది. ఐపీఓ ఎన్ఏపీఎస్ గ్లోబల్ ఇండియా రూ. 35.90 లక్షల విలువైన 39891 షేర్స్‌ను కొన్నాడు. ఐపీఓలు కొనుగోలు చేసిన షేర్లకు భారీగా విలువ పెరుగుతుండడం, స్కీన్‌పై కోట్ల రూపాయల లాభం కనిపించింది. వాటిని విత్ డ్రా చేసుకోవాలంటే మీరు ట్యాక్స్‌లు, ఇతరాత్ర డబ్బు చెల్లించాలంటూ షరతులు విధించారు. ఇలా బాధితుడు రూ. 75,65,700 పెట్టుబడి పెట్టడంతో రూ. 1000 లాభం వచ్చింది. అయితే మొత్తం రూ. 75.65 లక్షలు నష్టపోయానంటూ బాధితుడు రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక షెడ్యూల్ విడుదల

### ఈ నెల 28న నోటిఫికేషన్ జారీ

సిటీబ్యూరో, మార్చి 24 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక షెడ్యూల్ విడుదలైంది. ఈ కోటా కింద ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న ఎం.ఎస్.ప్రభాకర్‌రావు పదవీ కాలం మే ఒకటితో ముగియనున్నది. ఈ నేపథ్యంలో ఖాళీ కానున్న ఆ స్థానాన్ని భర్తీ చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు మొదలుపెట్టింది. ఇందులో భాగంగా సోమవారం కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. ఈ మేరకు ఎన్నికకు సంబంధించి ఈ నెల 28న నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. అప్పటి నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలు కానున్నది. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ వచ్చే నెల 4న ముగియనున్నది. ఏప్రిల్7న నామినేషన్ల పరిశీలన ప్రక్రియ చేపట్టనున్నారు. అనంతరం తొమ్మిదో తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇవ్వనున్నారు. ఆపై వచ్చే నెల 23న పోలింగ్ తేదీగా కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరగనున్నది. వచ్చే నెల 25న కౌంటింగ్ చేపట్టనున్నారు. వచ్చే నెల 2న ఈ ఎన్నిక ప్రక్రియ ముగియనుంది. ఈ నేపథ్యంలో సోమవారం నుంచే హైదరాబాద్ నగర పరిధిలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది.

# అర్హత లేకున్నా.. నియామకమా?

### 'గాంధీ'లో సూపరింటెండెంట్ నియామకంపై అసంతృప్తి

### 'ఎన్‌ఎంసీ' ప్రకారం అర్హులు కాదనే వాదన

### దవాఖాన నిర్వహణ గాడితప్పుతున్నదని విమర్శలు

సిటీబ్యూరో, మార్చి 24 (నమస్తే తెలంగాణ): ప్రతి రోజూ సుమారు 2వేల నుంచి 3వేలకు పైగా ఓపీ రోగులకు, 2000మంది రోగులకు ఐపీ సేవలు అందించే గాంధీ దవాఖానకు నిష్ణాతులైన అనుభవజ్ఞులైన అధికారిని సూపరింటెండెంట్‌గా నియమించడం ఇప్పటి వరకు కొనసాగిన ఆనవాయితీ. కానీ ఇటీవల జరిగిన బదిలీల అనంతరం గాంధీ దవాఖానకు సూపరింటెండెంట్‌గా నియమించిన వైద్యాధికారి ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం అర్హులు కాదనే వాదన వినిపిస్తోంది. నల్గొండ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న సదరు వైద్యాధికారిని అర్హత లేకున్నా కొందరి పెద్ద సిఫారసు మేరకు నిత్యం వేల సంఖ్యలో రోగులు చికిత్స పొందే గాంధీ దవాఖానకు సూపరింటెండెంట్‌గా నియమించడంపై పలువురు వైద్యులు, అధికారులు అంతర్గతంగా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

#### నిబంధనలు ఏం చెబుతున్నాయి...?

నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ)నిబంధనల ప్రకారం టీచింగ్ హాస్పిటల్‌కు సూపరింటెండెంట్‌గా నియమించాలంటే వారు క్లినికల్ ఓరియంటేషన్ కలిగి ఉండాలి. అంటే రోగులకు వైద్య చికిత్సలు అందించడంలో అనుభవం కలిగిన వారై ఉండాలి. దీంతో పాటు అదనపు డీఎంఈ హోదా కలిగి ఉండాలి. ప్రస్తుత సూపరింటెండెంట్ ఫిజియాలజీ చేశారు. ఫిజియాలజీ వారికి క్లినికల్ ఓరియంటేషన్ ఉండదు. అంటే వారు మెడికల్ ప్రాక్టీస్ చేసి ఉండరు. కేవలం బోధనకు మాత్రమే పరిమితమవుతారు. సాధారణంగా అదనపు డీఎంఈ హోదాతో పాటు క్లినికల్ ఓరియంటేషన్ కలిగి ఉన్న వారు టీచింగ్ హాస్పిటల్స్‌కు సూపరింటెండెంట్లుగాను, ఇతర అన్ని రకాల హోదాలకు అర్హులు. ఫిజియాలజీ వంటి నాన్ క్లినికల్‌కు చెందిన వారు అదనపు డీఎంఈ హోదా కలిగి ఉన్నప్పటికీ బోధన, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ హోదాకు అర్హులవుతారు. కానీ ప్రస్తుతం గాంధీ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న వైద్యాధికారి అదనపు డీఎంఈ హోదా కలిగి ఉన్నప్పటికీ క్లినికల్ ఓరియంటేషన్ లేదని, అంత పెద్ద స్పెషాలిటీ దవాఖానకు ఎన్ఎంసీ నిబంధనలకు విరుద్ధంగా సూపరింటెండెంట్‌ను చట్టం ప్రకారం నియమించారని పలువురు సిబ్బంది చెబుతున్నారు.




#### అంతా తానై...

క్లినికల్ పరంగా ఎలాంటి అనుభవం లేకపోవడంతోనే గాంధీ దవాఖాన నిర్వహణ గాడితప్పుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గాంధీ దవాఖానలో రోగులకు సరైన వైద్యం, మందులు అందడం లేదని, పరిపాలనా పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని, ఇప్పటికే అనేక సార్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రితో పాటు డీఎంఈ స్థాయి అధికారులు సైతం దవాఖానను సందర్శించారు. ఈ నేపథ్యంలోనే దవాఖానలో విధులు నిర్వర్తిస్తున్న ఓ సీనియర్ ఆర్ఎంవోనే చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తున్నది. గతంలో ఇక్కడ పనిచేసిన అనుభవం ఉండడంతో ప్రస్తుతం సూపరింటెండెంట్‌కు అన్నీ తానై దగ్గరుండి పరిపాలనా వ్యవహారాలను చక్కబెడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదీ ఏమైనా అంతిమంగా రోగులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని, నిత్యం వేల సంఖ్యలో రోగులు చికిత్స పొందే గాంధీ దవాఖాన వంటి పెద్ద దవాఖానలకు అర్హులైన, అనుభవజ్ఞులైన అధికారులను నియమిస్తే అటు రోగులకు, ఇటు వైద్యసిబ్బందికి మేలు జరుగుతుందని పలువురు వైద్య సిబ్బంది, రోగులు అభిప్రాయపడుతున్నారు.